# శ్రీ ధనార్జనరావు

డి. నాగార్జునరావు ఒట్టి అర్జునరావుగా రూపాంతం పొందడం ఒక పౌరాణికమైన యథార్థం లేక సంభావ్యత అని చెబితే అది వాస్తవం కాదనో లేక అతిశయోక్తిగానో వుందని ఖరాఖండిగ చెప్పడం కష్టం. అది అర్థనారీశ్వర రూపంలో గర్భితమైన తికమక లాగా వుంటుంది. ఆ రూపంలో ఏ భాగము ఒప్పు, ఏ భాగము తప్పు లేక ఏ భాగం ఎక్కువ మహత్తరం అనే అనుమానం పుడితే పురుష జాతి అంతా ఆ అవతారం కుడి భాగంతో ఏకీభవిస్తారు. వామభాగం అంటే స్త్రీ అనే అనుకుంటారు కదా? అయితే కుడి భాగానికే ప్రాముఖ్యత ఎక్కువా లేక ఆ భాగమే ఎక్కువ ఒప్పుగా వుందని ఎలా నిరూపించగలం? పోనీ, ఇంగ్లీషు భాష సహాయం తీసుకుందాం. ఇంగ్లీషులో కుడి భాగానికి 'రైట్' అనేగా చెప్పేది? 'రైట్' అని చెబితే సరయింది లేదా ఒప్పు అని అర్థం. కాని 'లెఫ్ట్' అనే పదానికి తప్పు అని అర్థం ఇవ్వడానికి వీలు లేదు. అయినా గూడ ''లెఫ్ట్'కు , 'రైట్' అనే పదానికి విపరీతార్థం అనడం రైటే. (ఇక్కడ మొత్తం స్త్రీ సమాజాన్ని క్షమాపణ కోరడం పురషజాతి నిలకడకీ అత్యావసరమని అనుకుంటాను). ఏమైనాగూడా, నాగార్జున నామధేయ పరివర్తనలో పౌరాణికత్వం వుందా? లేదా? అనే ప్రశ్నకు 'వుంది' లేక 'లేదు' అని ధైర్యంగా చెప్పగలం. ముందు 'లేదు' అనే పదాన్ని సమర్థించి చూద్దాం. పేరు మార్చిన విషయం ప్రస్తావించాలంటే ఒక పురాతనమైన సంఘటన అని చెప్పుకోవచ్చు. కారణమేమిటంటే, ఆయకిప్పుడు వయస్సు యాభైకి పైనేవుంది. అతని వయస్సు పదునెనిమిద వుండేటప్పుడు ఆ నామధేయం వ్యవహారంలో పరివర్తనం పొందింది. అందుకే అది ఒక పాత... చాలా పాత... పోనీయండి. పురాతనమైన సంఘటన అని ఒప్పుకుందాం. అయినా గూడా అది ఒక పౌరాణిక విషయం కావడానికి వీలు లేదే! కాని, ఆ నామధేయం పాత్రతోనే అడిగితే, ఆ విషయంలో పౌరాణికత్వం యొక్క ఛవి తప్పకుండా వుందని చెబుతాడు. దానికి కారణమూ నామధేయ పరివర్తనకు కారణమూ ఒకటే. ఆయనకు చిన్నప్పటి నుంచే భారతంలో అంటే మహాభారతంలో వున్న అర్జునుడంటే భలే ఇష్టం. నాగార్జున అంటే చాలా అయిష్టం. ఆ అయిష్టానికి రెండు కారణాలు వున్నాయి. ఒకటి పాకే జంతువులంటే ఆయన మనసులో వుండే భావం, భయం కావచ్చు. లేకపోతే జుగుప్స కావచ్చు. ఆకారణంగా, నాగార్జునలో వున్న 'నాగ' పదాన్ని జీవిత కాలమంతా ఆలింగనం చేస్తూ కూర్చోవడం ఆయనకు ఇష్టం లేదు. అలా అయితే సాక్షాత్ శంకరుడి స్థితి ఏమిటి? వారిని పాములే గదా ఆలింగనం చేసింది. పార్వతీదేవి శయన మందిరంలో అడుగుపెట్టేటప్పుడు, ఆ చంద్రశేఖరుడు తన నాగాలంకారాన్ని పక్కన తీసిపెడుతూ వుంటారేమో.

నాగార్జున పేరుపై ఆ వయసులోవున్న రెండవ అభ్యంతరం ఏమిటంటే బౌద్ధమత మంటే ఆయనకు పెద్ద గౌరవముండేది కాదు. చిన్నప్పుడు, కుక్కలపై రాళ్లు విసరడం

ఒక వినోదంగా అలవాటు చేసిన అబ్బాయికి అహింసా సిద్ధాంతం మీద పెద్ద నమ్మకముండేది కాదు. అది కాకుండా జన్మతః మాంసాహారి అయిన అతనికి ఎలాంటి ''గచ్ఛామి'' వెనకపోవడం ఇష్టముండేది కాదు.

అర్జునుడంటే అతనికి అతి ప్రియం అని చెప్పడానికి చాలా కారణాలున్నాయి. కురుక్షేత్ర సంగ్రామంలో అసలు సిసలైన హీరో అర్జునుడే కదా! ఆ పంచపాండవులలో చాలా ''పాపులర్''గా వుండేది కూడా అతనే. ఆ అయిదుగురిలో ద్రౌపదికి ఎక్కువ మక్కువైన వాడు కూడా అర్జునుడే. పాంచాలి ప్రేమ విషయం గురించి, మన నాగార్జునుడికి పెద్ద అభిప్రాయముండేది కాదు. ఎందుకంటే, అర్జునుడికి కూడా, ఆ స్త్రీరత్నంలో ఐదింటిలో ఒక భాగము మాత్రమే కదా వాటాగా దొరికేది. కాని, అలాంటి లెక్కలు, గణితము ఏం లేకుండా, తనకు స్వంతమయిన ఒక సుభద్రను సంపాదించడం ఆ వీరుడికి సాధ్యమయింది. సుభద్ర అనే పేరు వినగానే ఆ యువకుడికి రోమాంచము కలిగేది. కాని, విషయాలు అక్కడితో ఆగిపోతాయా? ఊర్వశి ఆ సుందర పురుషుడికోసం తన సర్వస్వం అర్పణ చేయడానికి సిద్ధంగా వచ్చింది. కాని, ఆ దేవేంద్రుడి నాలుగింటిలో ఒకటిని స్వీకరించడానికి, ఆ పాంచాలి ఐదింటిలో ఒకటికి ఇష్టముండేది కాదు. అందుకేగదా, ఊర్వశీ శాపం తరువాత ఉపకారంగా మారింది. ద్రోణాచార్యుడికి అర్జునుడండే ఎంత ప్రేమ వుండేది!! ఏకలవ్యుడనే ఒక షెడ్యూల్డ్ ట్రైబు కుర్రవాడు, అర్జునుడికంటే సమర్థుడవుతున్నాడని తెలుసుకున్న ఆ మహాచార్యుడు ఆ బీదవాడి కుడిచేతి బొటనవ్రేలు గురుదక్షిణగా కోయించి తీసుకొని, ద్రోణాచార్యుడుగా మారలేదా? కాని, అందులో అర్జునుడి తప్పేమి లేదు కదా!

పౌరాణిక కారణాలు వున్నా లేకపోయినా, మన కథానాయకుడు తన పదునెనిమిదవ యేట డి. నాగార్జున రావు అనే పేరు పరిష్కరించి డి.ఎన్. అర్జునరావు అని మార్పు చేసినది, 1947 ఆగష్టు 15వ తేది భారతదేశానికి స్వాతంత్రం లభించినట్టుగా ఒక చరిత్ర ప్రధానమైన సంఘటనే. కాని ఒకే ఒక వ్యత్యాసముంది. స్వాతంత్ర్యం లభించింది అర్ధరాత్రి అయితే, ఇతని పేరు మార్పు జరిగినది పట్టపగలు.

ఆరడుగుల ఎత్తు, మంచి రంగు, సుందరమైన ఇటాలియన్ కవళికలు వుండటం వల్ల ఒరిజినల్ అర్జునిడికంటే, తనే ఎక్కువ అందగాడని అతనికొక నమ్మకం వుంది. అందుకే, ఈ పెద్దమనిషి ఇంద్రలోకానికి తాత్కాలిక బదలీమీద పోవడంగాని ఈ ఊర్లోవున్నా, ఏదైనా మంచి హోటల్లో క్యాబరే నృత్యం చేయడానికిగాని ఊర్వశీ, మేనకా, రంభ, తిలోత్తమలు దిగిరావడం గాని జరిగితే, ఆ ఊర్వశి మాత్రంకాదు మిగిలిన ముగ్గురు నర్తకీమణులు కూడా ఇతని తాళానికి నర్తనం చేస్తారని తాను అనుకుంటే అందులో అంత పెద్ద తప్పేమీ లేదు. చాలామంది భూలోక రంభలు ఆయన్ని చూసి కంగాళి తనంతో గేలిచేస్తూ చిరునవ్వు చిందించేవారని కూడ ఆయనకు తెలుసు.

ఒక విధంగా మంచి విద్యార్జన తరవాత, రాష్ట్ర ప్రభుత్వంలో 'క్లాస్-1 గెజిటెడ్ ' పదవిలో చేరిన ఆయన ఈరోజు 'ఎన్‌ఫోర్స్‌మెంట్' విభాగంలో ఉన్నతాధికారిగా పని చేస్తున్నాడు. అన్ని జిల్లాలలో, తాలూకాలలో ఆయన సిబ్బంది చాలా చురుగ్గా పనిచేస్తుంటారు.

వివాహానంతరం నలుగురు ఆడపిల్లలకు తండ్రి అయిన ఆయనకు ఒక పుత్రుడు లేడు కదా అనే మనోవిచారం వున్నా గూడా, ఇంకా ఎక్కువ సంకటం సృష్టించుకోకుండా ఆయన సృష్టి రచనా విమోచక శస్త్ర క్రియకు విధేయుడైనాడు అని చెబితే అది అతని బుద్ధి వైభవాన్ని తెలుపుతుంది కదా!

ఆయన సతీమణి ఒక మోస్తరు పెద్ద కుటుంబం నుంచి వచ్చిన స్త్రీ. అయినా గూడా తమకున్న స్థిరాస్తులతో నలుగురు ఆడపిల్లలకు పరిణయాలు బాగా జరపడానికి సాధ్యమవుతుందా లేదా అని ఆమెకొక తీరని సందేహముంది. అందుకే తన భర్తను ఒక హరిశ్చంద్రమూర్తిగా తయారు చేయడంలోగాని, ఆయనను అలా వీక్షించడంలో గాని, ఆ 'ప్రాక్టికల్' స్త్రీకి ప్రత్యేకమైన తాత్పర్యమేమీ వుండేది కాదు. ఒక్కొక్క విభాగంలో పని చేసేటప్పుడు, వాటి వాటి పరిస్థితులను బట్టి, వాటిని ఉపయోగించడంలో శ్రీ డి.ఎన్. అర్జున రావు చాలా శ్రద్ధ చూపించేవాడు. ఒక్కొక్క శాఖలో తన 'మోదస్ ఆపరెండీ'' ఒక్కో ప్రత్యేకరకంగా వుండాలన్న నిష్కర్ష అభిప్రాయం ఆయనకుంది. తన గూటిలో పుల్లలు నింపి, సుఖంగా చేయాలని అనుకుంటే అలాంటి శ్రేయస్కర ప్రయత్నం మధ్యలో, ఆ గూడే కిందపడి చెల్లాచెదురు కాకుండా ఆయన తనమర్మ బుద్ధి బాగా వుపయోగించుకొనేవాడు. ఏమైనా గాని ఇప్పటిదాకా ఆయనకు ఎలాంటి ప్రమాదాలు జరుగలేదు. ఎక్కువ చెడ్డపేరు కూడా రాలేదు. సంపాదన గణనీయంగా వుంది కూడా. వారి ధర్మపత్నికి, తన ఆర్యపుత్రుడి, ధర్మాధర్మ మిశ్రమ శక్తిమీద మంచి విశ్వాసం అభిమానం వున్నాయి.

వారు తన దైనందిన కార్యక్రమాలన్నీ ఎంతో బుద్ధిగా, శ్రద్ధగా చేస్తుంటేగూడా, ఒక్కొక్క శాఖలో, వారితో కొంతకాలము పనిచేసిన వాళ్లకు ఆయన ప్రవర్తనా రీతులను విశ్లేషించడానికి అవకాశం లభించి వుంటుంది కదా? ఇంటిగుట్టు బయట రట్టు అన్నట్టుగా, రహస్యాలు బయటకు వెళ్లేది చాలా రకాలుగా జరుగుతాయి. ఆయన కింద పనిచేసే చాలామంది, వారి 'ఇనిషియల్స్' వారి ప్రధాన పేరుతో కలిపి ఒక క్రొత్త పేరు తయారు చేశారు. సార్ధకనామధేయంగా వున్న ఆ కొత్త పేరే ''ధనార్జన రావు''. ఆ పేరు వారికి నచ్చుతుందో లేదో, కాని అతనికొక కొడుకు పుడితే మాత్రం, అదే పేరు ఆ బిడ్డకు పెట్టడానికి సంభావ్యత వున్నట్టు చాలామంది రహస్యంగా అభిప్రాయపడుతూ, రహస్యంగానే ప్రకటిస్తుంటారు.

ఈ మధ్యలో ఆయన తీసుకున్న ఒక కొత్త ''మోడస్ ఆపరంజి'' అంత పెద్దగా 'రిస్క్' లేనిదే. ఆయన టూరు వెళ్లేటప్పుడు... (నెలలో మామూలుగా ఇరవై రోజులు టూర్‌లో వుంటారు... దానికి చాలా కారణాలున్నాయి...). వారుంటే ''ఇన్‌స్పెక్షన్ బంగోళ్లో'గాని, ట్రావలర్స్ బంగ్లాలోగాని లేక ప్రైవేటు గెస్టుహౌస్‌లోగాని, వారి సిబ్బంది మామూలుగా వారి సేవ కొఱకు గాని, బ్రీఫ్ కేసుకుగాని ప్రత్యేకమైన రక్షణ సదుపాయాలు అక్ఖరలేదు. తన తాత్కాలిక విశ్రమించే స్థానం వదిలేముందు గదిలో, బల్లమీద తన పర్సు, తాళం చేతులగుత్తి పెట్టి, పది నిముషాలు ఆయన బాత్‌రూమ్‌కు వెళ్లి, ఏదో ప్రార్థన చేసుకోవడం మామూలు. ఈ కొత్త తంత్రము తెలుసుకున్న సిబ్బంది వారికి అర్పణ చేయాల్సిన దక్షిణ, ఆయనకు తెలియకుండా ఆ పర్సులోపల పెడితే చాలు. బాతురూము నుంచి బయటకొచ్చిన ఆ ఆఫీసరు, ఎలాంటి అనుమానం లేకుండా తన పర్సు జేబులో పెట్టుకొని, కారెక్కి వెళ్లిపోతాడు. అతను వెళ్లిన తరవాత, అక్కడున్న సిబ్బంది నవ్వడంగాని, ఏడ్వడంగాని, శపించడంగాని వారివారి భావాను గుణంగా చేస్తుంటారు. కాని పర్సు పొట్ట ఉబ్బడంతో, ఆ పెద్ద ఉద్యోగస్థుడి తప్పేమీ లేదు కదా!

ఈ మధ్యన ఆయన ఆ క్రొత్త సూత్రానికి స్వస్తి చెప్పాడు. దానికి కారణం -

ముందు ప్రస్తావించిన రీతిలో ఒక గెస్టుహౌస్ గదిలో బల్లపై తన పర్సు తాళం చేతులగుత్తి వదిలేసి బాతురూములోకి వెళ్లారు. తిరిగి వచ్చేటప్పుడు, ఆపర్సు పరిస్థితి చూసి వారి మనసే పొంగిపోయింది. ఆ పర్సును చూస్తే దానికి దాదాపు తొమ్మిది నెలల గర్భం వున్నట్టు వుంది. అదికూడా లోపల కవలపిల్లలున్నట్టు. ఆ ధనలక్ష్మి భారాన్ని తన జేబులో కుక్కి పెట్టి సిబ్బందికి ఒక ధవళహాసం ప్రసాదించి ఆయన ఆ స్థలాన్ని వదిలాడు. ఇంటికి చేరిన తర్వాతనే ఆ మసాలదోసెను బయటకు తీసారు. దాన్ని విప్పి, లోపలవున్న కరెన్సీ నోట్లను బయటకుతీసి లెఖ్ఖపెట్టేటప్పుడు అతను వులిక్కిపడ్డాడు. తన సొంత డబ్బే. అయితే ఆ పర్సులో ముందు మూడు వందరూపా యల నోట్లు , కొన్ని చిల్లర నోట్లు. ఇప్పుడు ఆమూడు పెద్ద నోట్లకు బదులు మొత్తం లెక్కపెడితే రెండువందల రూపాయలే ఉన్నాయి. అందులో పదిరూపాయల నోట్లు మరికొన్ని, ఐదు రూపాయల నోట్లు, ఎక్కువగా రెండు రూపాయల నోట్లు.

తనక్రింద పనిచేసే ఉద్యోగస్థుల సత్యసంధత, స్వామిభక్తి, సద్భావం అనే సద్గుణా లపై ఆయనకు ఆరోజువరకు ఉన్న సదభిప్రాయం ఆ సంఘటనతో పటాపంచలైపో యింది.

---